



సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

విద్యా దీవెన... అందక వేదన

- అర్హులైన విద్యార్థులు 53,867
- 48,345 మంది తల్లుల ఖాతాల్లో జమ చేయాల్సిన సొమ్ము రూ.31.41 కోట్లు
- వేలాది మందికి నేటికీ జమ కాని సొమ్ము
- డబ్బుల కోసం విద్యార్థుల ఎదురుచూపులు

పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుల మొత్తాన్ని గడువు మేర ఎప్పటికప్పుడు తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా, అమల్లో మాత్రం అది కనిపించడం లేదు. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి ప్రభుత్వం మార్చి 19న జగనన్న విద్యా దీవెన డబ్బులను జమ చేసింది. బిటెక్ నాలుగో ఏడాది విద్యార్థులకు విద్యా సంవత్సరం ముగిసినా ఇప్పటివరకు ఒక క్వార్టర్ ఫీజునే చెల్లించారు. మూడు విడతల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంజినీరింగ్ మొదటి మూడు సంవత్సరాల విద్యార్థుల్లో కొంతమందికే డబ్బులు జమ అయ్యాయి. ఐటిఐ, పాలిటెక్నిక్ కోర్సులు చదువుతున్న వారిలోనూ కొంతమందికి డబ్బులు జమ కాలేదు. విద్యా సంవత్సరం ముగిసినా ఇప్పటివరకు నగదు రాకపోవడంతో, తమకు డబ్బులు వస్తాయా? లేదా? అన్న ఆందోళన విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జగనన్న విద్యా దీవెన పథకం కింద ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం నాలుగు విడతలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తోంది. ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ తదితర కోర్సుల కోసం ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో వేస్తోంది. విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుల మొత్తాన్ని ఏ త్రైమాసికానికి ఆ త్రైమాసికం ముగిసిన వెంటనే విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని చెప్పినా, సకాలంలో మాత్రం డబ్బులు రావడం లేదు. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు త్రైమాసికం డబ్బులు డిసెంబర్ ముగిసిన వెంటనే జనవరిలోనే నగదు జమ కావాల్సి ఉంది. ఈ ఏడాది మార్చిలో తల్లుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. అవీ అరకొరగానే జమ అయ్యాయి. ఇంజినీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఐటిఐ, డిగ్రీ తదితర కోర్సుల కోసం ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో వేస్తోంది.



డబ్బుల కోసం ఎదురుచూపులు

విద్యా దీవెన డబ్బులు జమ చేసే రోజున ఏయే సామాజిక తరగతికి ఎంతమంది తల్లుల ఖాతాల్లో ఎంత మొత్తం డబ్బులు వేస్తున్నారో ప్రభుత్వం వివరాలను విడుదల చేస్తోంది. ఇప్పటివరకు ఎంతమందికి నగదు జమ చేసిందో వివరాలను మాత్రం వెబ్‌సైట్‌లో ఉంచడం లేదు. ఇటు అధికారుల వద్ద కూడా వివరాలు లభ్యం కావడం లేదు.

మరోవైపు నగదు జమ కాని వారు ఎవరిని సంప్రదించాలన్న సమాచారం లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్యా దీవెన కింద జిల్లాలో 53,867 మందికి విద్యార్థులకు సంబంధించి 48,345 మంది తల్లుల ఖాతాల్లో రూ.31.41 కోట్లను జమ చేయాల్సి ఉంది. వీరిలో 4,124 మంది ఎస్‌సి విద్యార్థులకు గానూ 3,767 మంది తల్లుల ఖాతాల్లో రూ.3.37 కోట్లను ఇవ్వాల్సి ఉంది. 1,373 మంది ఎస్‌టి విద్యార్థులకు గానూ 1,272 మంది తల్లుల ఖాతాలకు రూ.52.97 లక్షలు చెల్లించాలి. 45,761 మంది బిసి విద్యార్థులకు గానూ 40,968 మంది తల్లులకు రూ.25.85 కోట్లు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ఇబిసి విద్యార్థుల్లో 1,730 మందికి సంబంధించి 1,588 మంది తల్లుల ఖాతాల్లో రూ.99.15 కోట్లు వేస్తామని నగదు జమ రోజున ప్రభుత్వ చెప్పింది. 703 కాపు విద్యార్థులకు గానూ 668 మంది తల్లుల ఖాతాలకు రూ.56.95 లక్షలను జమ చేస్తామని ప్రకటించింది. ఇక ముస్లిం, మైనార్టీలకు సంబంధించి మొత్తం రూ.9.95 లక్షలు చెల్లించాల్సి ఉంది. వీరిలో 157 మంది ముస్లిం విద్యార్థులకు రూ.8.27 లక్షలు, 19 మంది క్రిస్టియన్ విద్యార్థులకు రూ.1.68 లక్షలు జమ చేస్తామని ప్రకటించింది.

నగదు జమ కాని వారు సంప్రదించవచ్చు

జగనన్న విద్యా దీవెన కింద అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాలకు ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోంది. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం, ఇతర సాంకేతిక సమస్యల వల్ల డబ్బులు రాకపోతే సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సంప్రదిస్తే పరిశీలిస్తాం.

- ఆర్.గడ్డెమ్మ
ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌ఛార్జి

పోస్టల్ సంఘాలపై కేంద్రం కక్ష

రెండు సంఘాల గుర్తింపు రద్దుపై పలు సంఘాల ఖండన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు సాగించిన ఉద్యమానికి ఆర్థికసాయం అందించారన్న కారణంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రెండు జాతీయస్థాయి పోస్టల్ ఉద్యోగ సంఘాలపై కక్ష కట్టిందని పలువురు వక్తలు విమర్శించారు. స్థానిక పోస్టల్ ఉద్యోగుల సంఘ భవనంలో అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం గ్రూప్-సి ఉపాధ్యక్షులు యు.వి రమణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. ఎన్‌ఎఫ్‌పిఇ, ఎఐపిఇయు గ్రూపు-సి జాతీయ స్థాయి పోస్టల్ ఉద్యోగ సంఘాల గుర్తింపును రద్దు చేస్తూ గత నెల 26న కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జాతీయ స్థాయిలో అన్ని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఇప్పటికే పోస్టల్ ఉద్యోగులకు అండగా నిలిచాయని పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకులు గణపతి చెప్పారు.

పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను అడ్డుకుంటుండటంతో గత కొన్నేళ్లుగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆ సంఘంలో పనిచేస్తున్న నాయకులపై కేంద్ర ప్రభుత్వం దాడులు చేస్తోందని చెప్పారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ పాలకపక్షం అనధికారికంగా నడపబడుతున్న ఒక గుర్తింపు లేని సంఘం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు మేరకు స్వాతంత్ర్య సంగ్రామంలో సైతం కీలకపాత్ర పోషించిన చరిత్ర కలిగిన పోస్టల్ సంఘంపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ రెండు పోస్టల్ సంఘాల గుర్తింపును పునరుద్ధరించాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు, యుటిఎఫ్, సిఐటియు, ఎఐపిఆర్‌పిఎ, ఎపిఆర్‌పిఎ, పెన్షనర్ సంఘాలు, ఎఫ్ఎన్ఒ తదితర సంఘాల నాయకులు మాట్లాడారు.

ఎల్‌డిఎంగా సూర్యకిరణ్

శ్రీకాకుళం : జిల్లా లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌గా సూర్యకిరణ్ నియమితులయ్యారు. ఆ స్థానంలో ఇంతవరకు పనిచేసిన జి.బి.వి.డి హరిప్రసాద్ విజయనగరం జిల్లా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన 2019 జులై 11 నుంచి జిల్లా లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్‌గా సేవలందించారు. స్థానిక యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సభలో హరిప్రసాద్ సేవలను రీజనల్ మేనేజర్ తిలక్ కొనియాడారు. హరిప్రసాద్‌ను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అభినందించారు. సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వ పథకాల అమల్లో బ్యాంకులను సమన్వయపరుస్తూ సహకరించారని కితాబునిచ్చారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హరిప్రసాద్

వ్యాను ఢీకొని 65 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని గోపీనగరం వద్ద గల నాగావళి వంతెనపై శుక్రవారం వేకువజామున వ్యాను ఢీకొన్న ఘటనలో 65 గొర్రెలు మృతి చెందగా, ఎనిమిది గాయపడ్డాయి. ఇద్దరు గొర్రెల పెంపకందారులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రణస్థలం మండలం మహంతిపాలెంకు చెందిన గనమాన సూరప్పడు, నాసర గంగులు, పేకేటి తవుడు, గనమాన దుర్గయ్య శ్రీకాకుళం రూరల్ మండలం వాకలవలస నుంచి లావేరు మండలం బుడుమూరు వైపు గొర్రెల మందను తోలుకొని వెళ్తున్నారు. శుక్రవారం వేకువజామున 2.45 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు అరటి గెలలతో వెళ్తున్న వ్యాను గొర్రెల మందను ఢీకొంది. ఈ ఘటనలో 65 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది గొర్రెలు గాయపడ్డాయి. గనమాన సూరప్పడు, నాసర గంగులు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఆమదాలవలస ఎస్ఐ వై.కృష్ణ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మృతి చెందిన గొర్రెలు

ఇళ్ల నిర్మాణాలకు డబ్బులు చాలడం లేదు

పెంచాలని స్పీకర్‌ను కోరిన లబ్ధిదారులు

ప్రజాశక్తి - బూర్జ

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడం లేదని గృహ నిర్మాణ లబ్ధిదారులు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద వాపోయారు. మండలంలోని లాభాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు గృహ నిర్మాణ సమస్యలను మొర పెట్టుకున్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్నామని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామానికి చెందిన పిట్ట రేణుక ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా, నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోవడం లేదన్నారు. సిమెంట్, ఇటుక, స్టీల్, భవన నిర్మాణ కూలి రేట్లు పెరిపోయాయని, వాటిని తట్టుకుని ఇల్లు కట్టుకునే స్తోమత లేదన్నారు. గ్రామంలో పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేశారని, గూడు లేని నిరుపేదలను వదిలేశారని అదే గ్రామానికి చెందిన మరికొందరు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన స్పీకర్, తహశీల్దార్ రామారావును పిలిచించి ఈ గ్రామంలో కాకపోతే వేరే చోట ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు నారాయణమూర్తి, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, ఎంపిటిసి గుమ్మడి రాంబాబు, కె.నాగేశ్వరరావు, ఎఒ రాజేశ్వరరావు, పంచాయతీరాజ్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.



స్పీకర్‌కు సమస్యను వివరిస్తున్న లబ్ధిదారులు

25న 'ఉపాధి' సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని, పని ప్రదేశాల్లో సౌకర్యాల కల్పన, ఒక్క పూటే పనులు చేయించాలని తదితర డిమాండ్లతో ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం తెలిపారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో గల కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ అధ్యతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల పోరాటంతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని చెప్పారు. ఉపాధి చట్టం వచ్చిన తర్వాత వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనుల్లోనూ కూలి పెరిగిందని చెప్పారు. గ్రామాల్లో కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వలస కూలీలు, నిరుద్యోగ యువతీ యువకులు ఉపాధి హామీ పనులపై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు. అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కరోనా సమయంలో సుమారు 15 కోట్ల మంది వలస కూలీలు గ్రామాల్లోకి వచ్చారని, వారికి ఉపాధి పనులే ఆధారమయ్యాయని చెప్పారు. రెండు పూటలా పనుల వల్ల కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారని, వడదెబ్బకు గురై మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టం ద్వారా గతంలో సమకూర్చిన వేసవి అలవెన్సులు, మేట్లకు ప్రోత్సాహకాలు, మంచినీరు, మజ్జిగ సౌకర్యాలను బిజెపి ప్రభుత్వం తొలగించి, కూలీలు వారంతట వారే పనుల్లోకి రాకుండా చేస్తోందని చెప్పారు. ఉపాధి చట్టంలో మోడీ అమలు చేస్తున్న సంస్కరణలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి పనులు నిలబెట్టుకోవడానికి ఉపాధి కూలీలు అంతా కలిసికట్టుగా పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కలెక్టరేట్ వద్ద 25న చేపట్టే ధర్నాకు అధిక సంఖ్యలో కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొల్లి.ఎల్లయ్య, డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం

వధువు తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత

- కళ్యాణమస్తు, షాదీ తోఫాతో రూ.5.26 కోట్ల లబ్ధి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫాతో వధువు తల్లిదండ్రులకు ఆర్థిక లబ్ధి చేకూరనుందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కళ్యాణమస్తు, షాదీ తోఫా రెండో విడత నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. జిల్లాస్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక లబ్ధిని లబ్ధిదారుల తల్లుల ఖాతాలో జమ చేయనున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలను నివారించడం, పిల్లల చదువులను ప్రోత్సహించడం, పేద కుటుంబాలకు చెందిన వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. జిల్లాలో జనవరి - మార్చి 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 930 మంది కళ్యాణమస్తు, షాదీ తోఫా లబ్ధిదారులకు రూ.5.26 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాల కింద పేద కుటుంబాలకు చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, వికలాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక చేయూత అందజేసినట్లు చెప్పారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 98 మంది లబ్ధిదారుల తల్లుల ఖాతాలో రూ.55.45 లక్షలు, ఎచ్చెర్ల నియోజకవర్గంలో 126 మందికి రూ.72.50 లక్షలు, శ్రీకాకుళం నియోజకవర్గంలో 108 మందికి రూ.63.30 లక్షలు లబ్ధిదారుల తల్లుల ఖాతాలో జమ చేస్తున్నట్లు చెప్పారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 166 మందికి రూ.86.75 లక్షలు, నరసన్నపేట నియోజకవర్గంలో 128 మందికి రూ.68.85 లక్షలు, పలాస నియోజకవర్గంలో 97 మందికి రూ.51.25 లక్షలు, పాతపట్నం నియోజకవర్గంలో 92 మందికి రూ.58.30 లక్షలు, టెక్కలి నియోజకవర్గంలో 122 మంది లబ్ధిదారుల తల్లుల ఖాతాలో రూ.69.35 లక్షలు జమ చేయనున్నట్లు వివరించారు. అనంతరం రూ.5.26 కోట్ల నమూనా చెక్కును వధువు తల్లిదండ్రులకు ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, సుడా ఛైర్‌పర్సన్ కోరాడ ఆశాలత గుప్తా, కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, డిఆర్‌డిఎ పీడీ డి.వి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

నేటి నుంచి కాష్యూ ఎక్స్‌పో

ప్రజాశక్తి - పలాస

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా పలాస జీడి ఉత్పత్తులు పెంచడానికి కృషి చేస్తున్నామని జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం (పిసిఎంఎ) అధ్యక్షులు మల్లా సురేష్ కుమార్, కార్యదర్శి కె.వి శివకృష్ణ, కోశాధికారి పట్నాన రవికాంత్ అన్నారు. ఇందులో భాగంగా పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శని, ఆదివారాల్లో కాష్యూ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక పిసిఎంఎ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాష్యూకు సంబంధించి ఇటువంటి ఎక్స్‌పో ఇదే ప్రథమమన్నారు. మన దేశం నుంచే కాకుండా వియత్నాం ఇతర దేశాలకు చెందిన జీడిపప్పు యంత్రాలు ఇందులో భాగస్వామ్యం అవుతున్నాయని చెప్పారు. 28 అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఎక్స్‌పోలో కొత్త యంత్రాల ప్రదర్శన, అమ్మకాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇది మంచి అవకాశమన్నారు. ప్రపంచంలో జీడి ఉత్పత్తుల్లో వియత్నాం ప్రథమ స్థానంలో ఉందని, మనం ఆ దిశగా చేరుకోవడానికి కొత్త యంత్రాల వినియోగం ఆవశ్యకత ఉందన్నారు. జీడి వ్యాపారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరై కాష్యూ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎక్స్‌పోకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిసిఎంఎ నాయకులు

సర్పంచ్‌ల అధికారాలు నిర్వీర్యం

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్

పలాస : వైసిపి ప్రభుత్వ పాలనలో సర్పంచ్‌ల అధికారాలు నిర్వీర్యమయ్యాయని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ విమర్శించారు. కాశీబుగ్గలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబరు వ్యవస్థాపక అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేసుకుని సర్పంచ్‌ల సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. ఎన్నో ఆశలు పెట్టుకుని ప్రజలు సర్పంచ్‌లను ఎన్నుకున్నారని, ప్రభుత్వ తీరుతో వారికి ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి నోటి వెంట సర్పంచ్ అనే పదం రాలేదన్నారు. సర్పంచ్‌ల పర్యవేక్షణలో సచివాలయ వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంచాయతీల 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.8,660 కోట్లు ఈ రోజుకు రాని పరిస్థితి ఉందన్నారు. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఏం చేసిందో తెలియడం లేదన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన సర్పంచ్‌లు 90 శాతం మంది ఉన్నా ముఖ్యమంత్రిని ఎదిరించి మాట్లాడలేకపోతున్నారని చెప్పారు. సర్పంచ్‌ల విధులు, నిధుల సాధనకు ఈనెల 11న శ్రీకాకుళంలోని గ్రాండ్ హోటల్‌లో ఉద్యమ కార్యాచరణ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వి.ఎం.పురం, సుంకర జగన్నాథపురం సర్పంచ్‌లు వసంతరావు, అఖిల్, కుత్తుమ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు శంకర్

బాలల సమస్యలపై సైకిల్‌యాత్ర

జిల్లాకు చేరుకున్న సైక్లిస్ట్ ప్రభుకు ఎస్‌పి ఆర్థికసాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పిల్లలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక తదితర వేధింపులపై ప్రజలను చైతన్యపరిచే ఉద్దేశంతో గోవాకు చెందిన ప్రభు చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం జిల్లాకు చేరుకుంది. జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆయన ఎస్‌పి జి.ఆర్ రాధికను జిల్లా పోలీసు కార్యాలయంలో కలుసుకున్నారు. గోవా నుంచి బయలుదేరి నాలుగు వేల కిలోమీటర్లు సైకిల్‌పై తిరుగుతూ బాలలపై సాగుతున్న వేధింపులపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. దేశ్యాప్తంగా సుమారు 15 వేల కిలోమీటర్లు సైకిల్‌పై తిరిగాలనుకుంటున్నానని తెఇపారు. ప్రయాణం సాగిన తీరు, మార్గమధ్యంలో ఎదురైన సమస్యలను ఎస్‌పికి వివరించారు. ప్రభు సమస్యలపై స్పందించిన ఎస్‌పి, ఆయన్ను ప్రోత్సహించేందుకు ఆర్థికసాయంపై పలువురు దాతలను కోరారు. ఎస్‌పి సూచన మేరకు డాక్టర్ దానేటి శ్రీధర్, రెడ్డి చిరంజీవి, సూర శ్రీను, మెట్ట నాగరాజు, ఎస్ఎస్ జ్యూయలరీస్ సురేష్, చిన్ని ఫ్లెక్సీ చిన్ని, బోస్ ఈజ్ బ్యాక్, నేను సైతం తదితర ఎన్‌జిఒలు స్పందించారు. ఎస్‌పి కార్యాలయానికి వారంతా చేరుకుని సాయానికి ముందుకొచ్చారు. వారు సమకూర్చిన సుమారు రూ.50 వేల నగదును సైక్లిస్ట్ ప్రభుకు ఎస్‌పి అందజేశారు. ఈ సందర్భంగా యాత్రలో తన వెంట తెచ్చుకున్న వస్తు సామగ్రి, సాంకేతిక పరికరాలు, సైకిల్ మోడల్‌ను ఎస్‌పి, దాతలకు చూపించారు. జిల్లా పరిధిలో రోడ్డు మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రయాణం ప్రశాంతంగా సాగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందని ఎస్‌పి భరోసా కల్పించారు. కాశీబుగ్గలో ఈ విధంగా కొంత ఆర్థిక సహాయం చేస్తారని చెప్పారు. ఎస్‌పికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్తూ ప్రభు బయలుదేరి వెళ్లారు.



ప్రయాణ తీరును ఎస్‌పికి వివరిస్తున్న సైక్లిస్ట్ ప్రభు

రాగులు తీసుకో... రోగాలు తగ్గించుకో

విస్తారంగా చోడి పంట సాగు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రస్తుత జీవన విధానంలో ఉరుకులు పరుగుల మధ్య మానవుని జీవితం కొనసాగుతుంది. దీంతో అధిక ఒత్తిడి కారణంగా సుగర్, బిపి వంటి రోగాలు దరిచేరి ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీని కారణంగా ప్రతి ఒక్కరూ తమ రోజువారి జీవన విధానంలో రాగులు తీసుకో... రోగాలను నివారించుకో అన్న సూక్తిని పాటిస్తున్నారు. రాగులతో ఆరోగ్యానికి ఎంతో మేలు కలగనుంది. చిరుధాన్యాల్లో రాగి పంట ప్రధానమైనది. ప్రస్తుతం రాగిని ప్రధాన ఆహార ధాన్యంగా ప్రతిఒక్కరూ వినియోగిస్తున్నారు. మండలంలో నిమ్మతొర్లాడ, పెద్దజొన్నవలస, పొన్నాంపేట, వంజంగి గ్రామాల్లో పదెకరాల విస్తీర్ణంలో రైతులు చోడి పంటను సాగు చేస్తున్నారు. దీనిలో ముఖ్యంగా వెదజల్లే పద్ధతికి నాలుగు కిలోల విత్తనం సరిపోతుందని, నారు నాటడానికి మూడు కిలోల విత్తనాలు సరిపోతాయని ఎఒ మెట్ట మోహనరావు తెలిపారు. అలాగే విత్తన శుద్ధి చేయడానికి రెండు గ్రాముల కార్బన్డిజం, ట్రై సైక్లోజోల్ 75 శాతం డబ్ల్యుపి, మూడు గ్రాముల మాంకో జబ్ మందును ఒక కిలో విత్తనానికి కలపాలి. నేరుగా వెదజల్లే పద్ధతిలో మొలక శాతం బాగా


పెద్దజొన్నవలసలో సాగవుతున్న చోటి పంట

రావాలంటే విత్తనాన్ని 10 నుంచి 12 గంటలు నీటిలో నానబెట్టి ఆ తరువాత పల్చటి గుడ్డలో కాసేపు ఆరబెట్టి ఇసుకలో కలిపి నేరుగా పొలంలో పలుచగా చల్లుకోవాలి. ఆ తరువాత బల్లకాని, కంపతో గాని మట్టిని లాగాలని తెలిపారు. ఎకరా పొలంలో రాగి నారు నాటుకోవడానికి ఐదు సెంట్ల విస్తీర్ణంలో నారుమడిని తయారు చేసుకోవాలని, బాగా చివికిన పశువుల ఎరువులు తగినంతగా చల్లి రెండు కిలోల సూపర్ పాస్ఫేట్‌ను చల్లుకోవాలని తెలిపారు. విత్తన శుద్ధి చేసిన విత్తనాన్ని పలుచగా నారుమడిలో చల్లుకోవాలి. తర్వాత నారుమడిని తడుపుతూ ఉండాలి. నారుమడిలో నారును ఎప్పటికప్పుడు గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టిన యెడల ఆరోగ్యంవంతమైన నారు తయారవుతుందని తెలిపారు. పొలాన్ని బాగా దుక్కి చేసి ఎకరానికి రెండు నుంచి నాలుగు టన్నుల బాగా చివికిన పశువుల ఎరువును 12 కిలోల భాస్వరంను సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో పొలంలో వేసి బాగా కలియదున్నాలి. నత్రజనిని యూరియా రూపంలో రాగి నారు నాటే ముందు ఎకరానికి 26 కిలోలు నాటిన తరువాత ఒక నెల తరువాత మరో 26 కిలోలు పంటకు అందించాలి. వేసవిలో రాగి పంటను నీటి వసతికింద సాగు చేస్తారు. కనుక పంట కీలక దశలో ఉన్నప్పుడు బెట్టకు గురికాకుండా నీరు అందించాలి. నారు నాటిన తరువాత పైరు బాగా వేర్లు తొడిగేదాకా అంటే నాటిన 5 నుంచి 7 రోజుల తరువాత పంటకు మరో పులక తడి అందివ్వాలని అన్నారు. రాగి పంటకు కనీసం 5 నుంచి 6 తడులు కచ్చితంగా ఇవ్వాలన్నారు. పైరు నాటే ముందు, పిలకలు వేసే దశ, చిరు పొట్ట దశ, పూత దశ, గింజ కట్టే దశలలో నీటి ఎద్దడి లేకుండా పంటకు నీరు అందిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. మండలంలో రాగి పంట ఇప్పుడిప్పుడే సాగు శాతం పెరుగుతున్నదని అన్నారు. ప్రస్తుత జీవన విధానంలో ప్రతిఒక్కరూ రాగి పిండిని అధికంగా వినియోగిస్తున్నారని తెలిఆరు. భవిష్యత్‌లో పంట శాతం పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. రైతులకు అతితక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్నిచ్చే పంటలో చోడి ఒకటని అన్నారు.


పలాస : మాట్లాడుకున్న మంత్రి అప్పలరాజు

గిరిజన గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

నియోజకవర్గంలోని గిరిజన గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, పార్టీలకుతీతంగా ఇంటింటికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని లొత్తూరు పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, వైసిపి జిల్లా కార్యదర్శి ఉంగ సాయికృష్ణ, రెంటికోట సర్పంచ్ తిరుమల, పలాస మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్, గరుడఖండి ఎంపిటిసి మోహన్. లొత్తూరు సర్పంచ్ సవర పద్మావతి, ప్రతినిధి సవర సిమెన్ పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

హోంగార్డు కుటుంబానికి అండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

హోంగార్డు జనార్ధనరావు కుటుంబ సభ్యులకు పోలీస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. శ్రీకాకుళం యూనిట్‌లో విధులు నిర్వహించిన హోంగార్డు జనార్ధనరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు జిల్లాలోని హోంగార్డులందరూ ఒక రోజు వేతనం రూ.4.25 లక్షలు విరాళంగా వసూలు చేశారు. ఈ చెక్కును ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి రాధిక మృతుడు కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏ సహాయం కావాలన్నా పోలీస్‌శాఖ ముందుంటుందని అన్నారు. శాఖాపరంగా రావాల్సిన ప్రయోజనాన్ని త్వరితగతిన వచ్చేలా చూస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ఎం.శివరామరాజు, ఆర్ఐ ఉమామహేష్ పాల్గొన్నారు.

డిఎస్‌పి బాధ్యతల స్వీకరణ

పలాస : కాశీబుగ్గ డిఎస్‌పిగా జి.నాగేశ్వరరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణా జిల్లా నందిగాం నుంచి కాశీబుగ్గ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.శివరామిరెడ్డి ఉద్యోగోన్నతి లభించడంతో ఎసిపిగా విశాఖపట్నం నార్త్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరరెడ్డికి కాశీబుగ సిఐ జి.శ్రీనివాసరావు, సబ్ డివిజన్ చెందిన సిఐలు, ఎస్‌ఐలు కలిసి అభినందించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న నాగేశ్వరరావు

దరఖాస్తులకు ఆహ్వానం

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తపురంలో ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 11న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసుకోవాలన్నారు. మోడల్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్న 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని అన్నారు. ఈ నెల 9 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ బాలికలకు హాస్టల్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

రణస్థలం : మండలంలోని కొండములగా ఎపి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గల విద్యార్థులు https://apms.ap.gov.in/apmsలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టిలు రూ.75, ఒసి, బిసిలు రూ.159 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. మరింత సమాచారానికి 7702449892, 81424 26181, 9908000569కు సంప్రదించాలన్నారు.

జి.సిగడాం : జి.సిగడాంలోని ఎపి మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులకు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ అన్నాశామ్యూల్ లంక ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి ఆమదాలవలస సబ్ స్టేషన్ పరిధిలోని శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు పనుల కారణంగా పొడవాటి స్తంభాలను మారుస్తున్నామని అన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, లంకాం, రైస్‌మిల్ అండ్ బ్రిక్ ఇండస్ట్రీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు.

సచివాలయాలతో ప్రజల చెంతకు పాలన

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సచివాలయాలతో ప్రజల చెంతకు పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో రూ.61.80 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందజేస్తూ అవినీతి లేని పాలనను ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల దగ్గర నుంచి అన్ని రకాల సేవలను అందిస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. దక్షిణ భారతదేశంలో 35 ఏళ్లుగా ఎంపీగా సేవలందించిన వ్యక్తి బొడ్డేపల్లి రాజగోపాలరావు ఒక్కరేనని


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

కొనియాడారు. అటువంటి వ్యక్తి తిరిగాడిన నేల ఇది అని అన్నారు. ఎవరైనా జనం ఆమోదిస్తేనే నాయకుడిగా ఎదుగుతారని, లేనిపక్షంలో కనుమరుగు కాక తప్పదని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, వసుమతి, ఎంపిటిసి ప్రతినిధి బొడ్డేపల్లి లక్ష్మీనారాయణ, ఎంపిటిసి మాజీ సభ్యులు గురుగుబెల్లి ప్రభాకరరావు, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, పంచాయతీ సెక్రెటరీ ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

లావాదేవీలు సక్రమంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌బాబా

పలాస : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డ్వాక్రా సంఘాల లావాదేవీలను సక్రమంగా నిర్వహించి ప్రతి లావాదేవీలనూ రికార్డులో నమోదు చేయాలని వెలుగు ఫైనాన్స్ డిపిఎం పి.శ్రీనివాస్‌బాబా సిసిలకు, సిఎఫ్‌లకు, అకౌంటెంట్లకు సూచించారు. స్థానిక స్త్రీ నిధి భవనంలో మండలాల డ్వాక్రా సంఘాల రికార్డులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్రతి సంఘంలోనూ జరిగిన లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఆడిట్ అంతర్గతంగా నిర్వహిస్తున్నామని, అనంతరం పలాసకు చెందిన పి.వి. సతీష్ ఆడిట్ బృందం పరిశీలించి ఆడిట్ నిర్వహిస్తుందని చెప్పారు. రామ్, జానకిరావు, రామారావు, పలాస, వజ్రపు కొత్తూరు మండలాల ఎపిఎంలు మల్లేశ్వరరావు, జాంబవతీ, సిసిలు వెంకటేశ్వరరావు, నాగమ్మ, రేణుక పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఒడిశా మాజీ సిఎంకు సన్మానం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలను పురస్కరించుకొని కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఒడిశా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గొమాంగో సంబరాలకు వచ్చారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. గిరిధర్ గొమాంగో ఒడిశాలో ముఖ్యమంత్రిగా ఎనిమిదేళ్ల పాటు పాటించారని అన్నారు. ఇప్పటికీ ఆయనకు కళలపై ఉన్న మమకారంతో కళాకారునిగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి రాజు, బుడ్డేపు త్రినాథ్, ప్రకాష్‌కుమార్ సాహు, నవీన్ చౌదరి, కృష్ణయ్య, మోహన్ పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న సత్యప్రసాద్

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ దంపతులు చింతాడ మాధురి, సత్యప్రసాద్‌లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా పనులకు హాజరై అధిక కూలి పొందాలని సూచించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభం కావడంపై కూలీలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సానుకూల దృక్పథం అవసరం

వజ్రపుకొత్తూరు: పదో తరగతి పరీక్ష ఫలితాలు శనివారం విడుదల కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఎస్ఐ వై.మధుసూదనరావు కోరారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ముందుగానే పిల్లలతో మాట్లాడి ఫలితం ఎలా ఉన్నా... అధైర్య పడద్దని వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. ఎటువంటి విపరీత నిర్ణయాలు తీసుకోకుండా ధైర్యం చెప్పాలని తల్లిదండ్రులను కోరారు. పరీక్ష ఫలితం దృష్టిలో ఉంచుకొని పిల్లలపై తల్లిదండ్రులు ఎటువంటి కోపతాపాలు ప్రదర్శించవద్దని అన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గీతమ్మ

10న జిల్లాస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని నీలావతిలో ఉద్దాన ప్రాంత విద్యాభివృద్ధి వేదిక (యువివి) 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 10న జిల్లా స్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు యువివి ఉపాధ్యక్షులు పోతనపల్లి గీతమ్మ తెలిపారు. ముందుగా నీలావతిలో జిల్లా స్థాయి ఓపెన్ క్విజ్ పోటీల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొనేందుకు 9701151207, 9634314502 నంబర్లకు ఫోన్ చేసిపేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యువివి ప్రధాన కార్యదర్శి బొడ్డ చిన్నారావు, అధ్యక్షుడు ఇసాకోటి జోగారావు, గ్రంథాలయ కన్వీనర్ కుత్తుం ప్రకాష్, సహాయ కార్యదర్శి బుడత డిల్లేశ్వరరావు, బొమ్మాళి శివ పాల్గొన్నారు.

ఘనంగా కార్ల్ మార్క్స్ జయంతి

పర్లాకిమిడి : గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం కార్ల్ మార్క్స్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మహిత మీశాల్, ముచ్చి బంగారయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి డి.వెంకటరావు, సిపిఐఎంఎల్ (లిబరేషన్) సభ్యులు శ్రీను బెహరా, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, సుప్రతి సబర్, ఆశాని సబర్ పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

పారిశుధ్య కార్మికులకు భద్రతా దుస్తులు


భద్రతా దుస్తులను పంపిణీ చేస్తున్న రాజ్యలక్ష్మి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రేడియం స్టికర్ కలిగిన భద్రత దుస్తులను శానటరీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి శుక్రవారం పంపిణీ చేశారు. రోజూ వేకువ జామున, రాత్రి సమయాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు భద్రతగా ఉంటుందని రేడియం స్టికర్ కలిగిన షర్టులు అందించామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాటురు నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ దేవత ఉత్సవాలు జరుగుతున్న సమయంలో రోటరీ క్లబ్ చేస్తున్న ఈ మంచి పనికి అభినందనీయమని అన్నారు. కార్మికులకు భద్రత కలిగిన షర్టులు వల్ల ప్రమాదలపై అప్రమత్తం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, రోటరీ ప్రతినిధులు జోహర్ ఖాన్, పి.దినేష్, ప్రపుల్ల, ఎం.జి.రామన్, కె.రామారావు, వి.సురేష్, పాక తులసీదాస్, శానటరీ ఇన్‌ఛార్జి ఉపేంద్ర పాల్గొన్నారు.

వెంకటరావు మృతికి సంతాపం

వజ్రపుకొత్తూరు : మండలంలోని సీతాపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కుసుమురు వెంకటరావు ఇటీవల మృతి చెందారు. ఆయన మృతికి సిఐటియు మండల కన్వీనర్ ఎన్.మోహనరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బి.ఆనందరావు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. మృతుడు పేద కుటుంబానికి చెందినవాడని, మృతుడి కుటుంబానికి కార్మిక సంక్షేమ పథకాలు వర్తించే విధంగా కార్మికశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పరామర్శిస్తున్న నాయకులు

గ్రోయన్స్ పనులు వేగవంతం


పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

ఇచ్ఛాపురం : మండలంలోని బాహుదా నదిలో కేసిపురం వద్ద జరుగుతున్న గ్రోయన్స్ పనులు వేగవంతం చేయాలని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ మేరకు గ్రోయన్స్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చొరవతో కేశుపురం గ్రోయన్స్ పనులకు కలెక్టర్ రూ.28 లక్షలు మంజూరు చేశారని అన్నారు. వర్షాలు కాలం రాకుముందే పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కారంగి మోహనరావు, దక్కత నూకయ్య, సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, పిట్ట మాయ్య, ఆశి పురుషోత్తంరెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, రాంపత్ని చిట్టిబాబు, మాజీ సర్పంచ్ నీలపు చంద్రయ్య, ఇరిగేషన్ జెఇ పాణిగ్రహి పాల్గొన్నారు.

13 నుంచి వేసవి ఉచిత శిక్షణా శిబిరం

రణస్థలం: మండల కేంద్రంలోని పేద ప్రతిభ ఉన్న విద్యార్థులకు సామాజిక సేవకుల ఆర్థిక సహాయంతో మైడ్రీమ్ అకాడమి, ఎసిఫ్ ఆధ్వర్యాన ఈనెల 13వ తేదీ నుంచి 30 రోజుల పాటు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని మైడ్రీమ్ అకాడమి డైరెక్టర్ కళా వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జె.ఆర్.పురం సామాజిక వేత్తలు విద్యార్థుల భవిష్యత్ కోసం ఆలోచించిన తీరు హర్షణీయమని అన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ప్రవేశం పొందాలంటే ముందుగా ఈ నెల 7న స్థానిక శ్రీసాయి జూనియర్ కళాశాలలో నిర్వహించే పరీక్షకు రూ.వంద ప్రవేశ రుసుంతో హాజరు కావాలన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఆరో తరగతి నుంచి ఈ ఏడాది పదో తరగతికి వస్తున్న విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులపై 80 మార్కులకు పరీక్ష ఉంటుందని అన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన ప్రతి తరగతి నుంచి 20 మంది విద్యార్థుల చొప్పున ఎంపిక చేసి వంద మంది విద్యార్థులకు కొనసాగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8328013236 నంబరును సంప్రదించాలని సూచించారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్

'లోకోస్' యాప్‌పై అవగాహన అవసరం

ఆమదాలవలస : మహిళా సంఘాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇకపై జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న లోకోస్ యాప్ ద్వారా పొదుపు సంఘాల సభ్యుల పొదుపు, అప్పులు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ అనుసంధానం, ఫోన్ నంబరు, ఇకెవైసి, ఇన్సూరెన్స్ తదితర సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ డి.విద్యాసాగర్ అన్నారు. పట్టణంలోని వైఎస్‌ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అధ్యక్షతన మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు తమ్మినేని ధనలక్ష్మి, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు చంద్రావు, రమణ, సుభద్ర, ఉమ పాల్గొన్నారు.

జి.సిగడాం : లోకోస్ యాప్‌పై అవగాహన అవసరమని ఎపిఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. జి.సిగడాంలో మహిళా స్వయంశక్తి సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఎజిఎం వాక సత్యనారాయణ, మేనేజర్ ఉదయ్ కిరణ్, ఎంఎంఎస్ అధ్యక్షులు వాన ప్రమీల పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్థానిక మండల మహిళా సమాఖ్యలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల వివరాలన్నింటినీ లోకోస్ యాప్‌లో నమోదు చేసేందుకు 38 మంది గ్రామ సంఘ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నామని ఏరియా కో-ఆర్డినేటర్ శిష్ట శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ ఈ నెల 4 నుంచి 8 వరకు కొనసాగుతుందని చెప్పారు ఈ శిక్షణలో సభ్యులు డేటా, సంఘం డేటా, పొదుపు వివరాలు, అప్పుల వివరాలు, సభ్యుల సామాజిక, ఆర్థిక, జీవనోపాధులు వివరాలు అన్నింటినీ పారదర్శకంగా ఉండేటట్లు నమోదు చేయాలి సూచించారు. ఇకపై మహిళా సంఘాల వివరాలన్నీ ఒకే యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత ఉండే విధంగా లోకోస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. లోకోస్ యాప్ వల్ల పొదుపు సంఘాల సమగ్ర సమాచారం అంతా ఒకే చోట లభిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో ఎపిఎం గురువెల్లి నారాయణరావు స్త్రీనిధి ఎజిఎం సత్యనారాయణ, శ్రీనివాసరావు, మండల సమైక్య అధ్యక్షులు జయలక్ష్మి, కోశాధికారి నాగమణి, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.


టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న శ్రీరాములు

తీర్థపాన గొట్టం వితరణ

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లలో శివాలయానికి అదే గ్రామానికి చెందిన వైశ్యరాజు వాసుదేవ్, దమయంతి చిన్న కుమారుడు వెంకటరమణ మూర్తి, భారతి ఇత్తడితో తయారు చేసిన తీర్థపాన గొట్టం శుక్రవారం వితరణ చేశారు. ముందుగా శివ లింగం చుట్టూ ఉన్న తీర్థ పాన గొట్టాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో కూర్మారావు, సల్ల నాగేశ్వరరావు, పొందర త్రినాథ్ పాల్గొన్నారు.



వికలాంగశాఖ ఎడిగా కవిత

శ్రీకాకుళం: వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులుగా కె.కవిత నియమితులయ్యారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



క్రైమ్ కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతానగరానికి చెందిన బత్సల రామారావు (39) మోటార్ మరమ్మతుల చేస్తుండగా విద్యాదాఘాతానికి గురై మృతి చెందారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామారావు కొన్నాళ్లుగా ఉపాధి కోసం విదేశాల్లో పనిచేస్తున్నాడు. ఏడాదిన్నర నుంచి గ్రామంలోనే కూలి పనులు చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఎప్పటిలాగే ఉప్పు లోడింగ్‌కు వెళ్లి ఇంటికి వచ్చాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో తన ఇంటి వద్ద మోటర్ పంపు మరమ్మతులు చేస్తుండడంతో ఒక్కసారిగా విద్యాదాఘాతానికి గురయ్యాడు. ఆ సమయంలో ఆయన దగ్గర ఎవరూ లేకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి భార్య ఉమామహేశ్వరి వచ్చి చూసేసరికి భర్త విగత జీవుడై పడి ఉన్నాడు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన ఆమె స్థానికుల సాయంతో టెక్కలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల పరీక్షించి అప్పటికే మృత్యువాత పడ్డాడని ధ్రువీకరించారు. మృతునికి ఆరో తరగతి చదువుతున్న దీపిక, ఒకటో తరగతి చదువుతున్న విద్య ఉన్నారు. మృతునికి తల్లిదండ్రులు, సోదరులు ఎవరూ లేకపోవడంతో ఆ కుటుంబం అనాథగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో నౌపడ పోలీసులు కేసు నమోదు చేశారు.


రామారావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఆర్‌ఎంపి వైద్యుడు దుర్మరణం

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జాంపాడుకు చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు కొమనాపల్లి సింహాచలం (36) మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు వృత్తి రీత్యా రోజులానే ఎత్తురాళ్లపాడులో ఓ రోగి వద్దకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి దుప్పిలపాడు వెళ్ళేందుకు వస్తున్నాడు. హరిశ్చంద్రపురం ఫ్లైఓవర్ సమీపంలో మరమ్మతుకు గురై ఆగి ఉన్న ఇటుకల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సింహాచలం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య చరిత, కుమారుడు భార్గవ్, కుమార్తె పావనిలు ఉన్నారు. అయితే మృతుడు నిత్యం పరిసర గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. సింహాచలం మృతి చెందాడన్న విషయం తెలియగానే స్వగ్రామంతో పాటు పరిసర గ్రామాలన్నీ సోకస ముద్రంలో మునిగిపోయాయి. మృతుడు 25 ఏళ్ల క్రితం సరుబుజ్జిలి నుంచి వింజాపాడు వలస వచ్చి ఇక్కడే స్థిర పడి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవల అందిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. ఎస్ఐ షేక్ మహ్మద్‌ఆలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కోటబొమ్మాళి : సింహాచలం మృతదేహం

విశాఖలో జిల్లా వాసి...

కవిటి: మండలంలోని దుగానపుట్టుగకు చెందిన దుగాన సూర్యనారాయణ (49) విశాఖపట్నంలోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తూ శుక్రవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యనారాయణ విశాఖపట్నంలోని నవయుగ ఇంజినీరింగ్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం విధుల్లో ఉన్న సూర్యనారాయణ మధ్యాహ్నం భోజనం తరువాత పై అంతస్తు నుంచి కాలుజారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తోటి ఉద్యోగులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహానికి విశాఖ కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమారులు నవీన్, కిరణ్ ఉన్నారు. దీంత దుగాన పుట్టుగలో విషాద ఛాయలు అలముకున్నాయి.


కవిటి : సూర్యనారాయణ మృతదేహం


పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సుజాత

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

కవిటి: గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని కవిటికొత్తూరుకు చెందిన అంగన్వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ సుజాత శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లల తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఐసిడిఎస్ సిడిపిఒకి అందజేయనున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో మహిళా పోలీసు శారద, అంగన్వాడీ సిబ్బంది నీలగిరి పద్మ, మద్దు హైమవతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసుదేవ్

వాసుదేవ్ ప్రమాణ స్వీకారం

కవిటి: టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కో-కన్వీనర్‌గా మండలంలోని ప్రగడపుట్టుగకు చెందిన కొర్రాయి వాసుదేవ్ విజయవాడ టిడిపి కార్యాలయంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లు రవీంద్ర యాదవ్, బిసి సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, బిసి సాధికారత సమితి జిల్లా కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న శివాజీ

శివాజీ పరామర్శ

మందస : మండలంలోని చిన్నబరంపురానికి చెందిన తెలుగుదేశం పార్టీ యువకుడు నరేష్ బైక్ ప్రమాదంలో గాయపడి స్థానిక డాక్టర్ కూన పవన్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుని సలహాతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శివాజీతో పాటు రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్, మహేష్ ఉన్నారు.


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రామరాజు

ఘనంగా బుద్ధుని జయంతి

కొత్తూరు : మండలంలోని పొన్నుటూరు ప్రాథమికోన్నత పాఠశాలలో గౌతమి బుద్ధుని 2,567వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. సందర్భంగా రామరాజు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ట్రస్టు ఛైర్మన్ రామరాజు మాట్లాడుతూ బౌద్ధమతం అంతర్జాతీయంగా గుర్తింపు పొందిందని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గుంటముక్కల సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి ఎద్దు సంతోష్‌కుమార్, బలగ అప్పారావు, విద్యాకమిటీ ఛైర్మన్ సురేష్, పి.కేశవరావు, అల్లాడ సరస్వతి పాల్గొన్నారు.

అధ్వానంగా గిరిజన రహదారులు


అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాలో అతిపెద్ద గిరిజన మండలమైన మెళియాపుట్టిలో గిరిజన రహదారులు దయనీయ స్థితిలో ఉన్నాయి. అభివృద్ధి లేక గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ఏడాది పొడవునా రాకపోకలతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి లేక వాహన సౌకర్యానికి దూరమవుతున్నారు. గొడ్డ కూడలి నుంచి అనంతగిరి, ఆంపురం గ్రామానికి వెళ్లే ఐదు కిలోమీటర్ల మేర రహదారి ఏ చిన్న వర్షం పడిన బురదమయం అవుతుంది. నేలబొంతు నుంచి వీరన్నపేట మీదుగా భీంపురం మధ్య బిటి రోడ్డు రాళ్లు తేలిపోయాయి. రెండేళ్ల క్రిందట సంభవించిన తుపానుకు రోడ్డు ధ్వంసమైంది. ఇప్పటికీ రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. భరణికోట కాలనీ నుంచి బాలేరుకు వెళ్లే బిటి రోడ్డు రాళ్లు తేలాయి. అలాగే భరణికోట, ఇలైపురం, కోదుకోలిగామ్, ఎస్.ఎల్.పురం, కేరాసింగి, ఆంపురం, వెంకటాపురం, ముకుందపురం గిరిజన పంచాయతీల్లోని రోడ్లు మరీ దయనీయంగా మారాయి. ఏళ్లు గడుస్తున్న రహదారులు అభివృద్ధికి నోచుకోకపోవడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలాసార్లు విన్నవించాం



రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్ల అభివృద్ధి చెందకపోవడంతో గిరిజనులు వాహనాలకు దూరంగా ఉంటున్నారు. రాళ్ల తేలిన రహదారిలో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. చాలాసార్లు అధికారులు, నాయకులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది.

- వాబ జగన్, గిరిజన సంఘ నాయకుడు, ఆంపుం

ఎగ్జిబిషన్ స్టాల్స్ ప్రారంభం


పరిశీలిస్తున్న గిరిబాబు

పలాస: 'ఏ జీవికి లేనంత మేధాశక్తి మానవుని ఉందని, అటువంటి మానవ జీవనవిధానాన్ని సరైన మార్గంలో పెట్టేందుకు బైబిల్ వాఖ్యలు దోహదపడతాయని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. కాశీబుగ్గ పల్లి వీధిలోని జెఎస్ఎంబి చర్చిలో నిర్వహించిన వివిధ భాషల్లోని బైబిల్ ఎగ్జిబిషన్ కం సేల్స్ స్టాల్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాశీబుగ్గ కెటి రోడ్ విస్తరణలో భాగంగా క్రైస్తవ శ్మశానవాటిక ప్రహరీ తొలగించారని, రోడ్డు విస్తరణకు క్రైస్తవ సంఘాన్నీ సహకరించాయని అన్నారు. అనంతరం ప్రహరీ నిర్మాణానికి రూ.4.90 లక్షలు మంజూరు చేశామని అన్నారు. అనంతరం గిరిబాబుకు క్రైస్తవ సంఘ పెద్దలకు జెఎస్ఎంబి చర్చి పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో బైబిల్ సొసైటి కార్యదర్శి జాసిక్రమ్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా ప్రెసిడెంట్ కె.అబ్రహం, పలాస ప్రెసిడెంట్ బిషప్ సుందర్‌సింగ్, వైస్ ప్రెసిడెంట్ జిఎంఎస్ అనీల్రాజ్, ఎక్రటరీ జాన్సన్, ట్రెజరర్ పాలేవప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మీసాల సురేష్ బాబులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

కోటబొమ్మాళి: ఇంటింటికీ తాగునీరు, వైద్యం అందించడమే సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందులో భాగంగా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేసి తద్వారా నీటిని అందిస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన వీధులో ఇంటింటికీ కుళాయిలు వేసి తాగునీరు అందించిన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు సురక్షితమైన నీటిని అందిస్తామని అన్నారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌ఛార్జి గద్దవలస నాగభూషణరావు, సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామి, ఎంపిటిసి బొడ్డు అప్పన్న, మండల పరిషత్ ఉపాధ్యక్షులు రోజా పాల్గొన్నారు.


తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కొనసాగుతున్న నిరాహార దీక్ష

ప్రజాశక్తి- పర్లాకిమిడి

మూడు నెలలు క్రితం అనుమానాస్పద దంగా మృతి చెందిన సుదామిని రైతో కుటుంబ సభ్యులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు మహిత మిశాళ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద విద్యార్థి కుటుంబ సభ్యులు 11 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారు. ఈ దీక్షకు సిపిఎం నాయకులు శుక్రవారం సంఘీభావం ప్రకటించారు. దీక్షలో జెమ్స్, వి.మానసకుమార్ జన్నా, గోపి సబర్, నాగార్జున సబర్, సింహాచల సబర్ పాల్గొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు త్వరిగతిన విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ముచ్చి బంగారయ్య, పర్లాకిమిడి పట్టణ బాధ్యులు డి.వెంకటరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు శ్రీను బెహరా పాల్గొన్నారు.


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న పగడాలమ్మ

జెవికె స్టాక్ పాయింట్ పరిశీలన

మెళియాపుట్టి : మండలంలో కోసమాలలోని జెవికె మండల స్టాక్ పాయింట్‌ను టెక్కలి డిప్యూటీ డిఇఒ పి.పగడాలమ్మ శుక్రవారం పరిశీలించారు. అలాగే పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. మెళియాపుట్టిలోని ఎంఆర్‌సి కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జెవికె, నాడు-నేడు పనులపై పలు సూచనలు చేశారు. ఈమెతో పాటు ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, సిఆర్‌పిలు జె.ప్రభావతి, జయరాం, ప్రభాకర్, మహీనా, చిన్నారి, సవరయ్య, రామారావు ఉన్నారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

టిడిపి పూర్వ వైభవానికి కృషి

మెళియాపుట్టి : టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మండలంలోని సంతలక్ష్మీపురంలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, వాటిని ప్రజల వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌గౌడ్, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, ప్రధాన కార్యదర్శి ఉల్లాన వసంత్, సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, హనుమంతు చంద్రశేఖర్, విష్ణు పండ, పడాల శ్రీను పాల్గొన్నారు.

టిడిపి సెల్ఫీ ఛాలెంజ్


సెల్ఫీ తీసుకున్న వెంకటలక్ష్మి

ఇచ్ఛాపురం : పచ్చగా కళకళలాడే ఉద్దానాన్ని కిడ్నీ వ్యాధి కబలించిందని, ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధ జలాలు అందించాలనే ఉద్దేశంతో మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు ఎన్‌టిఆర్ సుజల ప్లాంట్లను ఏర్పాటు చేశారని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కాళ్ల వెంకట లక్ష్మి అన్నారు. శుక్రవారం ఎన్‌టిఆర్ సుజల ప్లాంట్ వద్దకు వెళ్లి సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఆ ప్లాంట్లు మరమ్మతులకు గురికావడంతో నిరుపయోగంగా పడి ఉందన్నారు. ఈ నాలుగేళ్లలో ఇలాంటి ఒక్క కార్యక్రమమైనా ప్రారంభించిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు కాళ్ల జయదేవ్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల సందర్శన

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలో ఉన్న హడ్డివాడ, పెద్దకేదారి, దబ్బగుడ్డి, కేరాసింగి పంచాయతీ పరిధిలోని కేరాసింగి, నేలబొంతు, డబారు గిరిజన గ్రామాలను సీతంపేట ఐటిడిఎ జిసిసి మేనేజర్ జి.సంధ్యారాణి శుక్రవారం సందర్శించారు. హడ్డివాడ, పెద్దకేదారి, దబ్బగుడ్డి గిరిజన గ్రామాల్లో రేషన్ సరుకులు అందజేయడానికి రేషన్ వాహనం వెళ్లడం లేదని ఇటీవల ఎమ్మెల్యే రెడ్డి శాంతి, సీతంపేట ఐటిడిఒ పిఒకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆమె పర్యటించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామాల్లోని ప్రజలు వారికి తాగునీరు, రహదారి, స్కూల్ భవనాలు తదితర సమస్యలు ఉన్నట్లు వారు తెలియజేశారు. నివేదికను సీతంపేట ఐటిడిఒ పిఒ కల్పనా కుమారికి అందజేయనున్నట్లు ఆమె తెలియజేశారు. ఆమెతోపాటు పాతపట్నం జిసిసి మేనేజర్ నరసింహులు, విఆర్ఒ సత్యనారాయణ ఉన్నారు.